పల్లె శుభ్రత

నెలాఖరు వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



నెల్లిమర్లలో బావి నీటిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి కూర్మినాయుడు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ ముమ్మరంగా సాగుతోంది. గుర్లలో డయేరియా ఘటన నేపథ్యంలో నెలాఖరు వరకు కొనసాగించనున్నారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం గ్రామాల్లో కాలువలను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు. పరిశుభ్రతపై ఏఎన్ఎం, ఆశాలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించి, ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రక్షిత మంచినీటి పథకాలను తనిఖీ చేసి, క్లోరినేషన్ చేయించారు. 15 రోజులకో సారి తప్పనిసరిగా ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. నీటి నమూనాలు సేకరించి, పరీక్షలు చేపడుతున్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, వ్యవసాయ, ఇంజినీరింగ్ అధికారులను పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. కలెక్టర్ అంబేడ్కర్, సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించేందుకు వెసులుబాటు కల్పించినట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఆర్థిక సంఘం నిధులు రూ.127 కోట్లు ఉన్నాయని, పనులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. బహిరంగ మల విసర్జన నిర్మూలనపై దండోరా వేయిస్తున్నట్లు చెప్పారు.

శుద్ధ నీరు.. ఏ తీరు




ఈనాడు – విజయనగరం

ఉమ్మడి జిల్లాను అతిసారం వణికిస్తోంది.. కలుషిత జలమే దీనికి కారణం. పురపాలక సంఘాలు.. పంచాయతీలు సరఫరా చేస్తున్న నీరు సక్రమంగా లేక.. వ్యాధులు నేపథ్యంలో చాలామంది శుద్ధజల కేంద్రాలపై ఆధారపడుతున్నారు. అయితే ఆ నీరు ఎంత సురక్షితమో తెలియడం లేదు. కారణం.. చాలా వాటికి అనుమతులు లేకపోగా.. కుళాయి నీరు నేరుగా అమ్మేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రెండు జిల్లాల్లో శుద్ధ జల కేంద్రాలు 327 ఉన్నాయి. ప్రజల తాగునీటి అవసరాలను ప్రైవేటు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. చాలా చోట్ల సాధారణ జలమే రక్షితమని నమ్మించి ఆరోగ్యాన్ని కుదేలు చేస్తున్నారు.

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో 83 ఆర్వో ప్లాంట్లు ఉండగా వాటిలో అధికారులు గుర్తించినవి 53 మాత్రమే. అధికారికంగా అన్ని అనుమతులు ఉన్నవి మూడు. ఒకటి సీజ్ చేసి విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ప్లాంటు వద్ద 20 లీటర్ల నీటిని రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో సీసాలు, ప్యాకెట్ల రూపంలో అమ్ముతున్నారు. ప్రజలు ఆ నీటి నాణ్యతను చూడకుండా దాహం తీర్చుకుంటున్నారు. వీటి వైపు తొంగిచూసే రెవెన్యూ, పర్యావరణ, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు కరవయ్యారు.



తనిఖీలు సరే..

నాణ్యత లేని నీటి విక్రయాలతో ప్రజలను దోచుకుంటున్నారని బాధ్యతలు స్వీకరించిన నెల రోజులకే విజయనగరం కలెక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ స్పందించారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలని, తక్షణం చర్యలు తీసుకుని నివేదించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలు చేపట్టిన తహసీల్దార్లు చర్యలు తీసుకునే లోపే బదిలీలపై వెళ్లిపోవడంతో మళ్లీ యథాతథంగా ఆర్వో ప్లాంట్లలో అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

నిబంధనలు పాటించరా

ఆర్వో ప్లాంటుకు 11 రకాల లైసెన్స్‌లు అవసరం. తాజాగా కాలుష్య నియంత్రణ మండలి అనుమతి తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్ఐ) ధ్రువీకరణ ఉండాలి. జల పరీక్షలు చేయించాలి. ఆహార కల్తీ శాఖ నుంచి లైసెన్స్ తీసుకోవాలి. పంచాయతీ, పురపాలక సంఘాల్లో ఎన్‌వోసీ పొందాలి. తూనికల కొలత శాఖ నుంచి ప్యాకింగ్‌కు, పరిశ్రమలు, కార్మిక శాఖ నుంచి లైసెన్స్‌లు ఉండాలి. లావాదేవీలపై జీఎస్టీ చెల్లించాలి. వీటికి పాతరేసిన ప్రైవేటు వ్యాపారులు దండిగా సంపాదిస్తున్నారు. ఆర్వో ప్లాంట్ల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తక్కువ ధరకు విక్రయాల వల్ల అన్ని అనుమతులు ఉన్న వ్యాపారులు నష్టపోతున్నారని అనుమతి పొందిన ప్లాంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ పేర్కొన్నారు.

అనుమతులు లేని వాటిని మూసివేస్తాం: జిల్లాలో మూడు నెలల క్రితం ఆర్వో ప్లాంట్ల తనిఖీలు చేపట్టాం. 203 కేంద్రాల్లో తనిఖీల సమయానికి 16 మూతపడ్డాయి. 24 యూనిట్లకు అన్ని అనుమతులు ఉన్నాయి. నాలుగు సీజ్ చేశారు. మిగిలిన 159 ప్లాంట్లకు ఎలాంటి అనుమతులు లేవని తేలింది. నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు లేని యూనిట్లు మూసివేయిస్తాం.
– డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కలెక్టర్

తీరం గుండెల్లో దానా దడ!



న్యూస్‌టుడే, పూసపాటిరేగ, భోగాపురం

'దానా' తుపాను హెచ్చరికలతో జిల్లాలోని తీరప్రాంత గ్రామాల ప్రజల్లో మరోసారి దడ పట్టుకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం గురువారం నాటికి తుపానుగా మారి తీవ్ర ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చెప్పింది. దీని ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడనున్నాయని హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సుమారు 21 కిలోమీటర్లు తీర ప్రాంతం ఉంది. జిల్లాలో 20 వేల మంది మత్స్యకారులు ఉండగా వారిలో సముద్రంలో వేటతో ప్రత్యక్షంగా 3500 మంది, పరోక్షంగా 10 వేల మంది జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో 700కు పైగా మోటారు బోట్లు, 350 నాన్ మోటారు బోట్లతో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్తున్నారు. ఈ ఏడాది వేట నిషేధం తర్వాత మిచాంగ్‌తో పాటు మరో రెండు తుపాన్లు రావడంతో జిల్లాలోని మత్స్యకారులు వేట లేక తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు దానా హెచ్చరికలతో భయపడుతున్నారు.



చింతపల్లిలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టరు బి.ఆర్.అంబేడ్కర్

సురక్షిత ప్రాంతాలకు తరలించండి

విపత్తు ప్రకటన నేపథ్యంలో కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మండలంలోని చింతపల్లి గ్రామంలో బుధవారం పర్యటించారు. ఒడ్డున ఉన్న వలలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేసి, రక్షిత భవనాలకు వెళ్లేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులు, బాలింతలను పీహెచ్‌సీలకు తరలించాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చాందినికి సూచించారు. పూసపాటిరేగ మండలం చింతపల్లి పంచాయతీ గొల్లపేట, భోగాపురం మండలంలోని చాకివలసలో పర్యటించారు.

ఆందోళనలో అన్నదాత

భోగాపురం మండలంలో 1472 ఎకరాలు, పూసపాటిరేగ మండలంలో 5052 ఎకరాల్లో వరి సాగులో ఉంది. ప్రస్తుతం సగానికి పైగా వరి పొట్ట దశలో ఉండటంతో తుపానుతో గాలివానలకు వరి నేలకొరిగే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తీర ప్రాంత మండలాల్లో గాలుల ప్రభావం వల్ల విద్యుత్తు సౌకర్యం, తాగునీటి సరఫరా నిలిచిపోతే ఇబ్బంది లేకుండా జనరేటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు ఏవోలు నీలిమ, హరికృష్ణ పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో రైతులను అప్రమత్తం చేస్తున్నారు. తుపాను తగ్గే వరకు ఎరువులు, పురుగు మందులు వేయవద్దని సూచిస్తున్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో నీలిమ

సన్నద్ధంగా ఉండండి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో జిల్లాలో గురువారం నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వైద్యాధికారులు తదితర మండలాధికారులతో బుధవారం దూరదృశ్య సమావేశం నిర్వహించారు. ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

తుపాను రక్షిత కేంద్రాలు శిథిలావస్థకు చేరినా మరమ్మతుల గురించి యంత్రాంగం పట్టించుకోలేదు. పెచ్చులూడి, బీటలు వారి గాలిలో దీపాలుగా ఉన్న వీటిలో ఎలా రక్షణ పొందాలని తీర గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. విపత్తుల సమయాల్లో వసతి గృహాలు, పాఠశాల భవనాల్లోకి తరలించాల్సి వస్తోంది.

★ సముద్రంలో వేటాడి తెచ్చిన మత్స్య సంపద కోసం ఏర్పాటు చేసిన ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు, చేపలు ఆరబోత కోసం మూడేళ్ల కిందట తీర గ్రామాల్లో నిర్మించిన 212 ప్లాట్‌ఫారాలు తుపానుకు ఏమవుతాయోనని ఆందోళన చెందుతున్నారు.

★ తుపాన్ల అలజడి నుంచి ఒడ్డున ఉన్న నివాసాలకు ముప్పు తప్పించేందుకు తీర ప్రాంతం వెంబడి రక్షణ గోడ నిర్మాణం ఏళ్లుగా కలగా మారింది. ఏటికేడు సముద్రం ముందుకు రావడంతో ఒడ్డున ఉన్న ఇళ్లు దెబ్బతింటున్నాయి. గతేడాది మిగ్‌జాం తుపాను సమయంలో పూసపాటిరేగ మండలం తిప్పలవలస, భోగాపురం మండలం ముక్కాంలో అలల తాకిడికి ఇళ్లు కూలిపోయాయి. సుమారు 500 మీటర్ల మేర సీసీ రహదారి ధ్వంసమైంది.

జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ఈనాడు, విజయనగరం: రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన తర్వాత తొలిసారిగా జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు నగరానికి చేరుకుంటారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిసి, అక్కడి నుంచి జడ్పీ అతిథి గృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు గుర్ల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శిస్తారని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. 3.20 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని.. గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షిస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో పలు అభివృద్ధి అంశాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

గుర్లకు జగన్

నేడు రాక

ఈనాడు, విజయనగరం: మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 11.05 గంటలకు గుర్ల సమీపంలోని ఎస్ఎస్ఆర్.పేట వద్ద దత్త ఎస్టేట్‌కు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గుర్ల వెళ్లి డయేరియా బాధిత కుటుంబాలను పరామర్శిస్తారన్నారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలను తెలుసుకుంటారని, గొట్టపుబావులు, పైపులైన్లు, తాగునీటి వనరులు పరిశీలిస్తారని చెప్పారు.

అతిసారం అలజడి

జగన్నాథపురంలో 11 మందికి అస్వస్థత

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలం రేగటి అగ్రహారం పంచాయతీ మధుర గ్రామం జగన్నాథపురంలో అతిసారం అలజడి రేపింది. మూడు రోజుల్లో 11 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఆరుగురు చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఐదుగురు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చేరారు. గరివిడి పీహెచ్‌సీ వైద్యులు దీప్తి, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు గ్రామానికి చేరుకుని వైద్య శిబిరాన్ని సందర్శించారు.

పారిశుద్ధ్యలోపంపై జేసీ అసంతృప్తి

గ్రామాన్ని బుధవారం జేసీ సేధుమాధవన్ సందర్శించారు. కాలువల్లో మురుగు పేరుకుపోవడం, గ్రామంలో అపారిశుద్ధ్యం నెలకొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శిని పిలిచి పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రశ్నించగా తాను ఇటీవలే బాధ్యతల్లో చేరినట్లు బదులిచ్చారు. గ్రామంలోని ప్రజలు తాగేనీటిని పరీక్షలకు పంపించగా.. పెద్దగా లోపాలు లేనట్లు తేలిందని అధికారులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందించాలని ఆదేశాలిచ్చారు. ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారందరికీ తక్షణమే వైద్య సేవలు అందించాలన్నారు. సాయంత్రం కలెక్టర్ అంబేడ్కర్ గరివిడి మండల అధికారులతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు. వ్యాధిని అదుపు చేయడానికి చర్యలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు.



చిన్నారికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది



చికిత్స పొందుతున్న రోగులు

ప్రాంతీయాసుపత్రి కిటకిట

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రి అతిసార రోగులతో కిటకిటలాడుతోంది. ఈ నెల 10 నుంచి 23వ తేదీ ఉదయం వరకు 101 మంది బాధితులు చేరారు. వీరిలో చీపురుపల్లి మండలం నుంచి 13 మంది, గరివిడి మండలం-45, గుర్ల-37 మందితో పాటు చుట్టు పక్కల మండలాలకు చెందిన వారు ఉన్నారు. దుమ్మెద గ్రామానికి చెందిన ఐదుగురు, జగన్నాథపురం నుంచి ఆరుగురు, తెట్టంగి ముగ్గురు, నాగళ్లవలస నలుగురు, కె.పాలవలస నుంచి ఇద్దరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. దుమ్మెదకు చెందిన ఇద్దరిని మెరుగైన వైద్యానికి విజయనగరం వెళ్లాలని సూచించారు. బాధితుల తాకిడి అధికంగా ఉండడంతో మొదటి అంతస్తులోని వార్డులను వారికే వినియోగిస్తున్నారు. పిల్లలకు ప్రత్యేకంగా వార్డు కేటాయించారు. ముందస్తు జాగ్రత్తగా ఖాళీగా ఉన్న సముదాయంలో మంచాలు ఏర్పాటు చేసి వార్డు సిద్ధం చేశామని ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.సుధీర్ తెలిపారు.

సుద్దముక్కలకు డబ్బులొచ్చాయ్


గత పాలనలో అష్టకష్టాలు

విజయనగరం విద్యావిభాగం, పార్వతీపురం పట్టణం, కొత్తవలస, న్యూస్‌టుడే

■ పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గత ప్రభుత్వ హయాంలో నిర్వహణ నిధులు రాలేదు. 350 మంది పిల్లలున్న ఇక్కడ సుద్దముక్క కొనేందుకూ ఇబ్బంది ఎదురైంది. హెచ్ఎం వరప్రసాదరావు సొంతంగా రూ.90 వేల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం నిధులు విడుదల కావడంతో ఆయన ఊపిరి పీల్చుకున్నారు.

■ సీతానగరం మండలం మరిపివలస ఉన్నత పాఠశాలలో 150 మంది చిన్నారులు చదువుతున్నారు. కొన్నాళ్లుగా నిర్వహణ గ్రాంటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాష్ట్రంలో పాఠశాలలకు ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేశ్ రూ.100 కోట్లు నిర్వహణ గ్రాంటు విడుదల చేశారు. దీంతో ఏళ్లుగా జేబుల్లో డబ్బులు పెడుతున్న ప్రధానోపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. గత పాలనలో కనీసం నిధులు విడుదల చేయలేదు.



పిల్లలకు పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఉమ్మడి జిల్లాల పరిధిలో 3,299 పాఠశాలలున్నాయి. వీటిలో 2,45,294 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఏటా బడులకు నిర్వహణ నిధులు మంజూరు చేయాలి. వీటితో పాటు పాఠశాల గ్రాంటు అందించాలి. వైకాపా పాలనలో ఈ నిధులు విడుదల సరిగా లేదు. గతేడాది ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో చాలా మంది ప్రధానోపాధ్యాయులు జేబులోంచి ఖర్చు చేసి ప్రభుత్వం ఇస్తుందని ఎదురు చూశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో నిధులు వస్తాయా? రావా అనుకున్నారు.

ఎలా అంటే..

పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేస్తారు. పాఠశాలలో 15 మంది విద్యార్థులు లోపు ఉంటే రూ.10 వేలు, 50 మంది లోపుంటే రూ.12,500, వంద లోపుంటే రూ.25 వేలు, 250 మంది ఉంటే రూ.50 వేలు, 400 మంది అయితే రూ.లక్ష వరకు అందిస్తారు. వీటిని ప్రధానోపాధ్యాయులు సుద్దముక్కలు, కుర్చీలు, టేబుళ్లు, పెన్నులు, డస్టర్లు తదితర వాటికి వినియోగిస్తారు. ఇక పాఠశాల గ్రాంటు ప్రభుత్వం ఏటా విడుదల చేస్తుంది. వీటిని విద్యుత్తు బిల్లులు, గదుల మరమ్మతులు, తాగునీటి సమస్యలు తదితర వాటికి ఖర్చు చేస్తారు. నిర్వహణ గ్రాంటు కింద రూ.3.15 కోట్లు, 42 ఎమ్మార్సీలకు రూ.54.50 లక్షలు విడుదలైనట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా	పాఠశాలలు	మంజూరు	విడుదల	ఎంఆర్సీలు	నిధులు
విజయనగరం	1702	4.15 (కోట్లు)	2.07	27	35(లక్షలు)
పార్వతీపురం మన్యం	1597	2.16	1.08	15	19.5

రెండు మూడు రోజుల్లో జమ: పాఠశాలల నిర్వహణ, ఎంఆర్సీలకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి. ఆ మేరకు ఆయా హెచ్ఎంల ఖాతాలకు ఒకటి, రెండు రోజుల్లో జమ చేస్తాం. నిర్వహణ గ్రాంట్లు సక్రమంగా వినియోగించేలా దృష్టి సారిస్తాం. – పగడాలమ్మ, ప్రేమకుమార్, డీఈవోలు

రాత్రి 11 తర్వాత తిరిగితే కేసులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని నగరపాలిక, పురపాలక ప్రాంతాల్లో రాత్రి 11 తర్వాత తిరిగితే చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఆయన ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బంది మంగళవారం రాత్రి పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడులాంతర్లు, కోట కూడలి, బాలాజీ కూడలి, దాసన్నపేట రైతు బజారు, రింగు రోడ్డు, కొత్తపేట, ఐస్‌ఫ్యాక్టరీ, జమ్ము, వీటీ.అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం తదితర చోట్ల పరిశీలించారు. రాత్రి 11 గంటల తర్వాత దుకాణాలు మూసివేయాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగించినా, సహేతకమైన కారణం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



నగరంలో రాత్రివేళ తిరుగుతున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

పారాది వంతెన పనులు చకచకా



సిద్ధం చేస్తున్న సామగ్రి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలకు ప్రధాన మార్గమైన పారాది వంతెన శిథిలావస్థకు చేరడంతో ఐదేళ్లుగా ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వారధి నిర్మాణంలో కదలిక తీసుకొచ్చింది. ఈనెల 4న ఎమ్మెల్యే బేబీనాయన శంకుస్థాపన చేశారు. వేగావతిలో నీరు తగ్గడంతో పనులు చకాచకా సాగుతున్నాయి. శిథిలావస్థకు చేరిన వంతెనపై తేలికపాటి వాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. నదిలో నిర్మించిన కాజ్‌వేపై భారీ వాహనాలను మళ్లించారు. వంతెన నిర్మాణానికి రూ.13.40 కోట్ల వెచ్చించనున్నారు. పనులు ఏడాదిలోగా పూర్తి చేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. సకాలంలో వంతెన పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించామని ర.భ.శాఖ ఏఈ అప్పలరాజు తెలిపారు.


మాబడి తోట.. ఆరోగ్య బాట



కుంతాం పాఠశాలలో పండించిన కూరగాయలతో చిన్నారులు

విద్యార్థులకు పోషక విలువలతో నిండిన ఆహారం అందించాలనే ప్రభుత్వ ఆశయం చక్కటి ఫలితాలనిస్తోంది. మాబడి తోట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలల ఆవరణల్లో బీర, ఆనప, వంగ, బెండ తదితర 12 రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రద్ధతో రక్షణ బాధ్యతను తీసుకోవడంతో కొన్నిచోట్ల కూరగాయలు కాపు దశకొచ్చాయి. కుంతాం, బడ్నాయకవలస, సరాయివలస, నంద పనుకువలస, చొక్కాపువలస తదితర గ్రామాల్లోని విద్యాలయాల్లో వారంలో ఒకపూట భోజనానికి సరిపడేలా సమకూరుతున్నాయని ఎంఈవో పి.సతీష్ తెలిపారు. చిన్నారులు చదువుతో పాటు సాగుపై కూడా దృష్టిసారిస్తున్నారని చెప్పారు

– న్యూస్‌టుడే, పాచిపెంట



నంద పనుకువలస గ్రామంలోని విద్యాలయంలో పందిరికి వేలాడుతున్న బీర, ఆనప కాయలు



నంద పనుకువలస పాఠశాలలో కాపుకొచ్చిన గోంగూర



పోలియోను అంతం చేస్తామని బాలలు పంతం పట్టారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాజాం మండలం పొగిరిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం 'end polio' ఆకృతిలో ఏర్పడి చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఆప్తాల్మిక్ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. – న్యూస్‌టుడే, రాజాం

'గిరి' విద్యార్థులకు నాణ్యమైన ఆహారం

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కొన్నేళ్లుగా విద్యా సంస్థల్లో ఆహారం కలుషితం కావడం, మెనూ అమల్లో లోపాలు, ఈక్రమంలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ఆహారం సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈమేరకు డైట్‌ఛార్జీలతో పాటు మరి కొంత సొమ్మును ఆ ఫౌండేషన్‌కే అందించనుందని తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పరిధిలో 94 ఆశ్రమ పాఠశాలలు, 24 పోస్టుమెట్రిక్ వసతి గృహాలున్నాయి. వీటి పరిధిలో సుమారు 30 వేల మంది చదువుతున్నారు. ఆయా విద్యా సంస్థల్లో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇచ్చి, వారి ద్వారా ఆహారాన్ని తయారు చేయించాలని భావిస్తున్నారు. అక్షయపాత్ర ద్వారా రోజువారీ సరఫరా చేస్తారు. కోడిగుడ్లు, కోడికూర(చికెన్) మాత్రం ప్రత్యేకంగా వండి నిర్దేశిత రోజుల్లో పెట్టనున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది..

ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యకు తగినట్లు వంటవారు లేరు. దీంతో చాలా కాలంగా సంక్షేమాధికారులు, డిప్యూటీ వార్డెన్లు తమ సొంత డబ్బులతో బయట వారిని ఏర్పాటు చేసుకొని పనులు చేయిస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో నాలుగో తరగతి ఉద్యోగులు పోస్టులు 96 వరకు ఖాళీగా ఉన్నాయి. 87 పోస్టులను పొరుగు సేవల కింద భర్తీ చేసేందుకు ఇప్పటికే అనుమతులు వచ్చినా ఇంకా ప్రక్రియ పూర్తికాలేదు. పార్వతీపురం ఐటీడీఏలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి తోడు నెల తరబడి డైట్ బిల్లులు బకాయిలున్నాయి. ఈ భారమంతా సంక్షేమాధికారులు, హెడ్మాస్టర్లు, డిప్యూటీ వార్డెన్లపై పడుతోంది. వీరిని వంట బాధ్యతల పర్యవేక్షణ నుంచి తప్పిస్తే ఇతర సమస్యలపై దృష్టిసారించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అక్షయపాత్ర ద్వారా ఆహారం సరఫరా చేసే ప్రక్రియ ప్రారంభం కానుందని గిరిజన సంక్షేమ సాధికారత అధికారి అన్నదొర 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



గిరిజన వసతి గృహంలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

పంచ్ పటాకా.. పతకాల సాధక..!

వారు పోడియంపై నిలబడితే.. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి.. పంచ్ విసిరితే పతకాల పంట పండుతుంది. నిరుపేద కుటుంబాల్లో పుట్టినా.. వారి లక్ష్యానికి అది అడ్డంకి కాలేకపోయింది.. బాక్సింగ్ క్రీడపై చిన్నతనం నుంచి ఉన్న ఆసక్తితో పట్టుదల, సాధనతో ప్రతిభ చాటుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ.. విజేతలుగా నిలుస్తున్నారు జిల్లాకు చెందిన యువ క్రీడాకారులు. 'ఖేలో ఇండియా' శిక్షకుడు సీతారామాంజనేయులు శిక్షణతో మరింత రాటుదేలుతున్నారు. ఇటీవల పలు జాతీయ టోర్నీల్లో పతకాలు సాధించారు.

– న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

క్రీడా కిరణం...



విజయనగరంలో ఓ సాధారణ కుటుంబానికి చెందిన డి.కిరణ్‌కుమార్‌కు పాఠశాల స్థాయి నుంచే బాక్సింగ్‌పై మక్కువ కలిగింది. నిత్య సాధనతో సత్తా చాటుతున్నాడు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతూ చదువు, క్రీడలో రాణిస్తున్నాడు. గతేడాది నగరంలో జరిగిన అండర్-17 స్కూల్‌గేమ్స్‌లో స్వర్ణం గెల్చుకున్నాడు. ఇటీవల విశాఖలో నిర్వహించిన టోర్నీలో ప్రతిభ చాటి గువాహటి మీట్‌కు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యమని పేర్కొన్నాడు.

బరిలో దిగితే బాదుడే..

పుత్సలవీధికి చెందిన టి.బాలకుమార్ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఆరుసార్లు పాల్గొన్నాడు. 2023- స్కూల్‌గేమ్స్ అండర్-17లో స్వర్ణం సాధించి, మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి మీట్‌కు ఎంపికయ్యాడు. అసోసియేషన్ జూనియర్ టోర్నీలో బంగారు పతకం గెలిచి, అరుణాచల్‌ప్రదేశ్ నేషనల్ మీట్‌కు ఎంపికయ్యాడు. ఈ ఏడాది విశాఖలో జరిగిన పోటీలో ప్రతిభ చాటి గువాహటి టోర్నీకి ఎంపికయ్యాడు. ఇందులో టాప్-8లో నిలిచాడు.



తండ్రి స్ఫూర్తితో..



లంకాపట్నానికి చెందిన డి.నిరీక్షణ ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతోంది. తండ్రి మారయ్య బాక్సింగ్ క్రీడాకారుడు కావడంతో చిన్నతనం నుంచి ఆ క్రీడపై ఆసక్తి పెంచుకుంది. పట్టుదలతో సాధన చేసి జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లలో సత్తా చాటుతోంది. జాతీయస్థాయిలో రెండు సార్లు పాల్గొంది. గతేడాది జిల్లాలో జరిగిన రాష్ట్ర స్కూల్‌గేమ్స్- 17లో స్వర్ణం కైవసం చేసుకొని దిల్లీలో జరిగిన జాతీయస్థాయి మీట్‌కు ఎంపికైంది. ఈ ఏడాది గువాహటి టోర్నీలో రజతం కైవసం చేసుకొని టాప్-8లో నిలిచింది. హరియాణాలో జరిగిన మీట్‌లో కాంస్యం గెల్చుకుంది. తండ్రి స్ఫూర్తితో అడుగులు వేస్తున్నట్లు ఆమె చెబుతోంది.

ప్రతిభతో పతకం పట్టి..



జిల్లా కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.సూర్యతేజ్ రాష్ట్ర, జాతీయస్థాయిలో మూడు సార్లు చొప్పున పాల్గొన్నాడు. గతేడాది నగరంలో జరిగిన టోర్నీలో స్వర్ణం సాధించి మహారాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. విజయవాడ టోర్నీలో బంగారు పతకం కైవసం చేసుకొని అరుణాచల్‌ప్రదేశ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ ఏడాది విశాఖలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి, హరియాణా మీట్‌కు ఎంపికై కాంస్యం పొందాడు

జాతీయస్థాయి గుర్తింపే లక్ష్యం

జొన్నగుడ్డికి చెందిన సతీష్, జ్యోతి దంపతుల కుమారుడు ప్రభాస్ వర్ధన్. ఇంజినీరింగ్ చదువుతున్నాడు. 2022- శాప్ లీగ్‌లో ప్రతిభ కనబర్చాడు. రాజమహేంద్రవరంలో 2023లో జరిగిన స్కూల్‌గేమ్స్-19 పోటీల్లో స్వర్ణం గెలిచి, మధ్యప్రదేశ్‌లో జరిగిన నేషనల్ టోర్నీకి ఎంపికయ్యాడు. అదే ఏడాది విశాఖలో నిర్వహించిన రైల్వే 6వ యూత్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి, సిక్కింలో నేషనల్ మీట్‌కు ఎంపికై రాణించాడు. విశాఖలో యూనివర్సిటీ టోర్నీలోనూ స్వర్ణం గెల్చుకొని.. సౌత్‌జోన్ టోర్నీలోకి అడుగుపెట్టిన ప్రభాస్ ఒకే ఏడాది మూడు నేషనల్ టోర్నీల్లో ఆడాడు. ఇండియా బాక్సర్‌గా గుర్తింపే లక్ష్యమని పేర్కొంటున్నాడు.



28న జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా జిల్లాస్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు గురజాడ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. ఈనెల 28న ఉదయం నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తామన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 'కన్యాశుల్కం- నాటి సామాజిక పరిస్థితులు' అంశంపై 4 నిమిషాలు మాట్లాడాలని, గురజాడ దేశభక్తి, సాహిత్యంలో మహిళ అన్న అంశంపై సీనియర్, జూనియర్ విభాగాల వారికి వ్యాసరచన ఉంటుందని చెప్పారు. విజేతలకు నవంబరు 30న సాయంత్రం బహుమతులు అందిస్తామని, వివరాలకు 83744 49526, 99127 64646 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేత్రదానంతో మరొకరికి చూపు



ఎస్.లక్ష్మి (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస మండలం తుమ్మికాపల్లి పంచాయతీ శివారు కాళింగపేటకు చెందిన ఎస్.లక్ష్మి(70) బుధవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న విన్నకోట రాజేష్ బాధిత కుటుంబ సభ్యుల్ని సంప్రదించి నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో ఆమె కుమారుడు కనకరాజు, మనవళ్లు సంతోష్, భైరాగి ముందుకొచ్చారు. ఈక్రమంలో విశాఖపట్నానికి చెందిన మోహిషిని ఐ బ్యాంకు సిబ్బంది చేరుకుని లక్ష్మి కార్నియాలు సేకరించారు. నేత్రదానంతో మరొకరికి చూపు ఇవ్వొచ్చని రాజేష్ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	132	234	244

అత్యాచారం ఫిర్యాదుపై దర్యాప్తు

పార్వతీపురం పట్టణం, పురపాలక, బొబ్బిలి, న్యూస్‌టుడే: అత్యాచారం ఫిర్యాదుపై పోలీసులు బుధవారం దర్యాప్తు నిర్వహించారు. పార్వతీపురంలోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిని బొబ్బిలి మండలానికి చెందిన యువకుడు అత్యాచారం చేశాడని ఆమె తల్లిదండ్రులు డయల్ యువర్ 100కి ఫిర్యాదు చేశారు. పార్వతీపురం పట్టణ పోలీసులు అప్రమత్తమై బాధితురాలిని కలిసి వివరాలు సేకరించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం బొబ్బిలి పోలీసులకు వివరాలు పంపించామని చెప్పారు. దీనిపై బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు, సమాచారం రాలేదన్నారు. పార్వతీపురంలో విద్యార్థిని ఇచ్చిన సమాచారం మేరకు యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, పురపాలక: ఫినాయిల్ తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పార్వతీపురంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొత్తవలసకు చెందిన శైలజ భర్త విజయవాడలో ఉంటున్నారు. ఆమె బుధవారం ఫినాయిల్ తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. బంధువులకు విషయం తెలిసి బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని, వివరాలు తెలియాల్సి ఉందని అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి మృత్యువాత



రమేష్ (పాతచిత్రం)

వంగర, న్యూస్‌టుడే: కడుపునొప్పితో ఓ యువకుడు ప్రాణాలు విడిచాడు. హెచ్‌సీ రామకృష్ణ వివరాల మేరకు.. వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన జి.రమేష్(31) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగు మందు తాగేశాడు. కుటుంబ సభ్యులు గమనించి, శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రమేష్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలరోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆయన తండ్రి అప్పలసూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అనుకోని ప్రమాదం.. తీసింది ప్రాణం

కొమరాడ, అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: దైవ కార్యక్రమానికి వెళ్లి, విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మన్యం జిల్లా వాసి దుర్మరణం చెందాడు. గాజువాక పోలీసుల వివరాల ప్రకారం.. కొమరాడ గ్రామానికి చెందిన కె.వెంకటనాయుడు(54)కు భార్య, కుమారుడు, వివాహాలైన ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద అల్లుడు వెంకటేశ్ విశాఖలోని జోగవానిపాలెంలో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇటీవల భవానీమాల వేశారు. బుధవారం ఇంటివద్ద పూజా కార్యక్రమం నిర్వహించారు. దీంతో వెంకటనాయుడు కుటుంబ సభ్యులంతా వెళ్లారు. సాయంత్రం అల్లుడితో కలిసి ద్విచక్రవాహనంపై ఎన్ఏడీ వైపు వెళ్తుండగా.. షీలానగర్ వద్దకు వచ్చేసరికి.. స్కూటీ ముందు భాగంలో ఉన్న నూనె డబ్బా కారణంగా హ్యాండిల్ తిరగకపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టారు. వెంకటేశ్‌కు స్వల్ప గాయాలు కాగా.. వెనుక కూర్చున్న వెంకటనాయుడు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడ్ని సమీప ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



వెంకటనాయుడు (పాతచిత్రం)



ప్రమాద స్థలిలో మృతిచెందిన వెంకటనాయుడు, గాయపడిన వెంకటేశ్(భవానీ మాలధారణ వ్యక్తి)

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి రైల్వేస్టేషన్ సమీపంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి అసోంకు చెందిన నిత్యానంద్‌రాయ్ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు రైల్వే హెచ్‌సీ చక్రధర్ తెలిపారు. భువనేశ్వర్ నుంచి విజయవాడ వెళ్తుండగా ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి, కుటుంబీకులకు సమాచారం అందించామన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ: ముగ్గురికి గాయాలు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన రామభద్రపురం మండలంలో జరిగింది. ఎస్సై ప్రసాదరావు వివరాల ప్రకారం.. రామభద్రపురం మండలం ఎస్.సీతారాంపురం గ్రామానికి చెందిన ఆర్.సురేష్, లక్ష్మణరావు, నాయుడువలసకు చెందిన బి.రాము బుధవారం రాత్రి బాడంగి- రామభద్రపురం ప్రధాన రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ఆటోలో బాడంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇవేం ప్రమాద సూచికలు

విశాఖ నుంచి కొత్తవలస, ఎల్.కోట, ఎస్.కోట మీదుగా పర్యాటక కేంద్రాలైన అరకు, అనంతగిరి, బొర్రా, పాడేరు వెళ్లే జాతీయ రహదారి దుస్థితి ఇది. జమ్మాదేవిపేట పంచాయతీ పరిధిలో ఇలా ఎక్కడికక్కడే గుంతలమయంగా మారింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో బోల్తా పడుతున్నట్లు చెప్పారు. దీంతో స్థానికులు గోతుల్లో ఇలా ప్లాస్టిక్ డబ్బాలు, నార సంచులు పెట్టారు. దీనిపై ఎన్‌హెచ్ ఇంజినీరింగు అధికారి సురేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట



పడితే కానీ పట్టించుకోరా..?

పార్వతీపురం పట్టణ శివారులోని నవిరి కాలనీ నుంచి అడ్డాపుశీల వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. నవిరి కాలనీ మలుపులో, అడ్డాపుశీల కూడలి వద్ద పెద్ద గుంతలు కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు గుంతల్లో కూరుకుపోతున్నాయి. రహదారికి ఓ వైపు పెద్ద గుంత ఏర్పడటంతో ఒరిగిపోతున్నాయి. దీంతో చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బెలగాం



శ్రీక్షేత్రంలో నేడు, రేపు దర్శనాల రద్దు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో గురు, శుక్రవారాల్లో భక్తుల దర్శనాలు రద్దు చేశారు. పూరీ పాలనాధికారి సిద్ధార్థశంకర్ స్వాయిన్ బుధవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ తుపాను వల్ల పూరీలో 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, వానలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించిన నేపథ్యంలో భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. హబిషార్థులు కూడా రాకూడదన్నారు. వారు తమ శిబిరాల్లో స్వామిని ఆరాధించాలన్నారు. శ్రీక్షేత్రం వెలుపల నుంచి కూడా పతితపావన దర్శనం చేసుకోరాదని, ఆలయ పరిసరాలకు రావద్దని విన్నవించారు.

నెల్లిమర్ల టిడ్కో గృహాలకు మహర్దశ

బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి నిధుల మంజూరు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే

నెల్లిమర్ల నగర పంచాయతీలో త్వరలో టిడ్కో గృహ నిర్మాణాలకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. గత అయిదేళ్ల పాలనలో వైకాపా నిధులు మంజూరు చేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీనితో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పనులు ప్రారంభించేందుకు ముందుకు అడుగులు పడుతున్నాయి.



నగర పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఆగిపోయిన నిర్మాణాలు

ఇదీ పరిస్థితి..

2014- 18 మధ్యలో 2,254 మంది లబ్ధిదారులను అప్పటి తెదేపా ప్రభుత్వం ఎంపిక చేసింది. తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం 720 మందిని అర్హులుగా తేల్చారు. వైకాపా వచ్చాక 578 మందినే గుర్తించారు. అప్పటికే 820 మంది నుంచి రూ.3.42 కోట్ల నగదును సేకరించారు. దీనిలో 242 మంది ఇళ్లను రద్దు చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు వారికి రూ.2.08 కోట్లను తిరిగి చెల్లించాల్సి ఉంది. నేటికీ ఇవ్వకపోవడం గమనార్హం.

మూడు నెలల్లో ప్రారంభం..

నగర పంచాయతీ పరిధిలోని నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాలకు చెందిన 576 మంది లబ్ధిదారుల పేరిట ఉన్న గృహ నిర్మాణాలు మరో మూడు నెలల్లో ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం మౌలిక సదుపాయాల కల్పన ప్రక్రియ సాగుతోంది. కిటికీలు, మరుగుదొడ్లు, తాగునీరు పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో భాగంగా చంపావతి నది నుంచి ప్రధాన లైన్లను ఇక్కడి ట్యాంకుకు అనుసంధానిస్తున్నారు.

వాటిల్లో కదలిక..

గృహ సముదాయం నుంచి నెల్లిమర్ల పట్టణానికి వెళ్లే మార్గంలో బీటీ రహదారిని నిర్మించేందుకు సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మధ్యలో శిథిల స్థితికి చేరిన కల్వర్టు స్థానంలో కొత్త నిర్మాణానికి రూ.80 లక్షలు విడుదల చేశారు. మరికొన్ని రోజుల్లో ఈ పనులు ప్రారంభిస్తామని టిడ్కో డీఈ శశిధర్ తెలిపారు. పెండింగ్ బిల్లులు కూడా త్వరలో విడుదలవుతాయని, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభానికి గుత్తేదారు సిద్ధంగా ఉన్నారన్నారు.

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి



సృజనకు పదును



రాజాం పట్టణంలోని నారాయణ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాలలు తమ మేధస్సుకు పదును పెట్టి ప్రతిభ చాటారు. జి.శ్రీనిజ (9వ తరగతి), పి.దీప్తి (8వ తరగతి), ఐ.భవ్యశ్రీ (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.బలరాం, ఒలింపియాడ్ ఇన్‌ఛార్జి గురుమూర్తి, తెలుగు ఉపాధ్యాయులు శైలజ విద్యార్థులను అభినందించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, రాజాం



ప్రతిభ చూపారు



బొబ్బిలి పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో (పర్చసం టట్) పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పి.సాహితి (9వ తరగతి), ఈ.గీతిక (8వ తరగతి), టి.ఆర్. అనూరాధ (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ మురళీధర్, వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, సిబ్బంది దుర్గాప్రసాద్, పి.ప్రసాదరావు, టీ.పి.నాయుడు విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు పి.వి.ఎల్.ఎన్ సాయిబాబా ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. – న్యూస్‌టుడే, బొబ్బిలి

సర్వే పారదర్శకంగా ఉండాలి

మెంటాడ, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింట సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎయిడ్స్, టీబీ నియంత్రణ వైద్యాధికారి కె.రాణి సూచించారు. బుధవారం మండలంలోని మెంటాడ, పిట్టాడ గ్రామాల్లో సర్వే జరుగుతున్న తీరు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. పలుచోట్ల అతిసార కేసులు నమోదవుతున్నాయని, అలాంటి వారిని పీహెచ్‌సీలకు తరలించాలన్నారు. తుపాను నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారిణి రాణి

నిర్వహణ లోపం.. వ్యాధులమయం

న్యూస్‌టుడే - గరివిడి, చీపురుపల్లి, గుర్ల

గడిచిన అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో ప్రధాన రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణ గాడితప్పింది. దాంతో నీరు కలుషితమై అతిసారం ప్రబలడానికి ప్రధాన కారణమైంది. షెడ్యూల్ ప్రకారం నీటి పథకాల ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాల్సి ఉన్నా.. నిధుల్లేక పనులేవీ గతంలో జరగలేదు. గతంలో ఏర్పాటు చేసిన చెత్తశుద్ధి కేంద్రాలు ఎక్కడా వినియోగంలోనే లేవు. గ్రామాల్లో డంపింగ్ యార్డుల్లేక చెత్త నిల్వలు పేరుకున్నాయి. కాలువల్లో మురుగు ఎక్కడికక్కడే పేరుకుంది. ఇవన్నీ వ్యాధులకు కారణాలవుతున్నాయి.

● నియోజకవర్గాన్ని వణికిస్తున్న అతిసారం

నదీతీర గ్రామాల్లోనే ప్రభావం

గుర్ల మండలంలో చంపావతి నదీ తీరప్రాంత గ్రామాలతో పాటు ఆ జలాలను తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్న గ్రామాల్లో అతిసారం ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. గుర్లలో వ్యాధి బారినపడిన 250 మంది క్రమేపీ కోలుకున్నారు. ప్రస్తుతం నాగళ్లవలసలో వ్యాధి లక్షణాలతో పలువురు బాధపడుతుండడంతో అక్కడ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇప్పుడు గూడెం గ్రామంలోనూ వ్యాధి ప్రబలింది. ఈ గ్రామానికి చెందిన ఆరుగురు గుర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో, గూడెం సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో నలుగురు చికిత్స పొందుతున్నారు. గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింట సర్వే చేపడుతున్నారు. ఏమాత్రం లక్షణాలు ఉన్నా వారిని శిబిరానికి తరలిస్తున్నారు.



చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో బాధితులు

చీపురుపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. గ్రామాల్లో కలుషిత నీరు, అపారిశుద్ధ్యమే ఇందుకు కారణమని గుర్తించిన అధికార యంత్రాంగం పల్లెల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతోంది. గరివిడి మండలం దుమ్మెద, జగన్నాథపురం, గుర్ల మండలం నాగళ్లవలస, తెట్టంగి తదితర గ్రామాలకు చెందిన రోగులు చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో చేరారు. వారిని ప్రత్యేక వార్డులో ఉంచి అవసరమైన మందులు సిద్ధం చేశామని, వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఉన్నారని సూపరింటెండెంట్ సుధీర్ తెలిపారు.

ట్యాంకర్లతో నీరు సరఫరా..

నీరు కలుషితం కావడమే అతిసారానికి కారణమని గుర్తించిన అధికార యంత్రాంగం వ్యాధి ప్రభావిత గ్రామాల్లో నీటి పథకాలు, బోరు బావుల నుంచి నీటిని వినియోగించకుండా నిలిపి వేయిస్తోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. నీటి వనరులన్నీ క్లోరినేషన్ చేయిస్తున్నారు. పథకాలు, బోరు బావుల నుంచి వచ్చేనీటి నుంచి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతున్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం..

వ్యాధి ప్రభావిత గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లోనూ నీటి వనరుల శుభ్రత, పారిశుద్ధ్య పనులు చేపట్టాం. ప్రత్యేక క్లోరినేషన్ డ్రైవ్ ద్వారా నీటి పథకాల ట్యాంకులు, బోరు బావులతో పాటు తాగునీటి వనరులన్నీ క్లోరినేషన్ చేయిస్తున్నాం. అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయి.

– వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? రామభద్రపురం మేజర్ పంచాయతీలోని ప్రధాన రహదారి ఇరుపక్కలా కాలువలు పాడై.. వర్షపునీరు వీధుల్లోకి వస్తోంది. - స్థానికులు

● కాలువల నిర్మాణానికి నిధులు మంజూరుకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

- శ్రీనివాస్, ఈవో

– న్యూస్‌టుడే, రామభద్రపురం

పరిశుభ్రత పనులు

స్పందనకు వందనం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని కాలువల్లో మురుగు, చెత్త పేరుకుపోయి అపారిశుద్ధ్యం నెలకొంది. దీనిపై 'వ్యాధుల కాలం.. వీధులు అపరిశుభ్రం' శీర్షికతో ఈనెల 23న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఈవో వై.ఝాన్సీరాణి, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాలరావు స్పందించారు. సిబ్బందితో కాలువలో పూడికలు తీయించారు.

నియంత్రికను సరిచేశారు

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం మండలం ఆగూరు ప్రాథమికోన్నత పాఠశాల వద్ద విద్యుత్తు నియంత్రికను సరిచేశారు. ఇంతవరకు ఓ వైపు వాలి ప్రమాదకరంగా ఉండేది. దీనిపై ఈనెల 6న 'ప్రమాదకరంగా నియంత్రిక' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన చిత్ర కథనానికి ఏఈ సురేష్ స్పందించి, చర్యలు తీసుకున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎండీయూ ఆపరేటర్లు రేషన్ సరకులు ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి మధుసూదనరావు హెచ్చరించారు. బొబ్బిలి మండలపరిషత్తు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కందిపప్పు కిలో రూ.67, అరకిలో పంచదార రూ.17కు విక్రయించాలని, ఈ రెండింటిపై రూ.3 అధికంగా తీసుకుంటున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖరీఫ్‌కు సంబంధించి నవంబరు 5 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని భావిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 135 మిల్లులు ఉన్నాయని, వాటి ద్వారా 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

రాజాంలో సమస్యల కొలువు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కీలకమైన సమస్యలు ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు(ఎస్‌టీపీ), నేచురల్ నీటి శుద్ధి పాంట్లు (ఎన్ఎస్‌టీపీ) ఏర్పాటు చేయాలనే డిమాండు ఉన్నా.. ఆచరణలోకి రావడం లేదు. మరోవైపు స్థల సమస్య పీడిస్తోంది. ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాల్సి ఉండడంతో అడుగులు ముందుకు పడడం లేదు. గత అయిదేళ్లలో ఎక్కడా అభివృద్ధి పనులు జరగలేదు. రహదారుల విస్తరణలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ప్రస్తుతం రాజాం- పాలకొండ మార్గం అధ్వానంగా దర్శనమిస్తోంది. పిక్క, బుగ్గి వేసి వదిలేయడంతో దుమ్ము రేగుతోంది. ఈక్రమంలో పురపాలిక అధికారులు రోజూ ట్యాంకర్లతో నీరు పోస్తున్నారు.



దుమ్ము రేగుతున్న రాజాం- పాలకొండ రహదారి

కాలనీల్లోనూ అంతే..

జీఎంఆర్ఐటీ సమీప ప్రాంతాల్లోని కాలనీల్లో రహదారులు, కాలువల సమస్య పీడిస్తోంది. బాలకవివలస- జీఎంఆర్ కేర్ ఆసుపత్రి మధ్య పెద్దఎత్తున భవన నిర్మాణాలు జరిగినా మౌలిక వసతులు లేవు. రహదారుల పక్కనే వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. సీసీ కాలువల నిర్మాణం కలగానే మిగులుతోంది.



సీసీ రహదారికి నోచుకోని ప్రధాన వీధి

ఆయా సమస్యలపై కమిషనర్ రామ అప్పలనాయుడును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. నిధుల లభ్యతను బట్టి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సీసీ రహదారులు, కాలువలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

శిథిలావస్థలో భవనం



రాజాం మండలం గుయ్యానవలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్దనున్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారింది. కూలేందుకు సిద్ధంగా ఉండడంతో పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, పాఠశాల విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో దుర్గారావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి, తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

అధ్వానంగా పశువైద్యశాల



రామభద్రపురం మండలం రొంపల్లి పంచాయతీలో 30 ఏళ్లక్రితం నిర్మించిన పశువైద్యశాల భవనం శిథిలావస్థలో ఉంది. నూతన భవనం నిర్మించాలని అధికారులకు విన్నవించుకుంటున్నా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు భయాందోళనకు గురై గ్రామంలోని సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీనిపై పశువైద్యాధికారి స్రవంతి వద్ద ప్రస్తావించగా.. కొత్త భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

పాఠశాల సమీపంలో చెత్త



మెంటాడ మండలం పోరాం జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలో రహదారి పక్కన చెత్త పేరుకుపోయింది. సమీపంలోని చెత్త సంపద కేంద్రం నిర్మించినప్పటికీ నిరుపయోగంగా మారింది. మరోవైపు పంచాయతీలో నిధులు కొరవడంతో రోజువారీ పారిశుద్ధ్య పనులు జరగడం లేదు. దీంతో స్థానికులు ఖాళీ ప్రదేశాల్లో చెత్తను పారబోస్తున్నారు. అనారోగ్యాల బారిన పడే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. చెత్తను వేరొక ప్రాంతానికి తరలిస్తామని ఈవోపీఆర్డీ విమలకుమారి అన్నారు.

– న్యూస్‌టుడే, మెంటాడ

చెరకు తోటల దగ్ధం



రేగిడి, న్యూస్‌టుడే: రేగిడి మండలంలోని బొడ్డవలసలో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో పలువురు రైతులకు చెందిన చెరకు తోటలు దగ్ధమయ్యాయి. విద్యుత్తు లైన్ల రాపిడి కారణంగా కాలిపోయినట్లు బాధితులు చెబుతున్నారు. పాలకొండ అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి శాంతకుమారి

దత్తిరాజేరు, రామభద్రపురం: గ్రామాల్లో అతిసారం విజృంభించకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారిణి శాంతకుమారి అన్నారు. బుధవారం గుచ్చిమిలో పర్యటించారు. పెదకాద గ్రామస్థులు ఏడొంపుల గెడ్డనీరు తాగొద్దని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. ● గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రత్యేక అధికారి ప్రశాంత్‌కుమార్, వైద్యాధికారి దీపక్ సిబ్బందికి సూచించారు. ఆరికతోట పీహెచ్‌సీని ఆయన సందర్శించారు.

ఇసుక తరలింపులో అక్రమాలకు పాల్పడితే చర్యలు



తమరాం రేవులో దస్త్రాలు పరిశీలిస్తున్న జేసీ

సంతకవిటి, రాజాం, తెర్లాం, మెరకముడిదాం, న్యూస్‌టుడే: ఇసుక తరలింపులో అవకతవకలకు పాల్పడినా, అక్రమార్కులకు అండగా నిలిచినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జేసీ సేధు మాధవన్ హెచ్చరించారు. బుధవారం సంతకవిటి మండలం తమరాం సమీపంలోని నాగావళి తీరంలో ఉన్న రీచ్‌ను తనిఖీ చేశారు. చీపురుపల్లి ఆర్డీవో జీవీ.సత్యవాణి తదితరులు ఉన్నారు. ● తాగునీరు కలుషితమైతే రోగాలు విజృంభిస్తాయని, నివారణకు పటిష్ఠ చర్యలు అవసరమని జేసీ పేర్కొన్నారు. రాజాం మండలం బొద్దాంలో పర్యటించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. ● కుసుమూరు ఇసుక రీచ్‌ను జేసీ పరిశీలించారు. బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహన్‌రావు, ఆర్ఐ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్



జగన్నాథపురంలో తాగునీటి ట్యాంకు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మధుసూదనరావు

బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం, గుర్ల, మెంటాడ, రేగిడి, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం జగన్నాథపురంలో నీటి ట్యాంకును మండల ప్రత్యేకాధికారి మధుసూదనరావు పరిశీలించారు. బోర్లు, కుళాయిలు, నీటిట్యాంకుల వద్ద సంప్‌లను శుభ్రం చేయాలన్నారు. ● రామభద్రపురం మేజర్ పంచాయతీలోని రక్షితనీటి పథకాలను మండల ప్రత్యేక అధికారి ప్రశాంతకుమార్, ఎంపీడీవో రత్నం పరిశీలించారు. ● గుర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యక్తిగత బోర్లుకు క్లోరినేషన్ చేపడుతున్నారు. నీటిని పరీక్షలు చేసి నివేదికలు అధికారులకు పంపిస్తున్నారు. ● గ్రామాల్లోని రక్షితపథకాలకు క్లోరినేషన్ చేస్తున్న వివరాలు, ఆయా ట్యాంకుల వద్ద ప్రదర్శించాలని ప్రత్యేకాధికారి ప్రమీలా గాంధీ ఆదేశించారు. సిబ్బందితో కలిసి మెంటాడలో పర్యటించారు. ● పారిశుద్ధ్యం, తాగునీరు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి ఆదేశించారు. లచ్చురాయపురం, నాయురాలవలస, వన్నలి, లక్ష్మీపురం, ఆడవరం, ఖండ్యాం, చాటాయవలస తదితర పంచాయతీల్లో పర్యటించారు.

గొర్రెలు, మేకలకు మందులు

గరివిడి, న్యూస్‌టుడే: జిల్లాలో 6.4 లక్షల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్టు పశుసంవర్ధక శాఖ జిల్లా సహాయ సంచాలకుడు వైవీ రమణ తెలిపారు. ఈనెల 16 నుంచి 31 వరకు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం గరివిడి మండలం దేవాడ, కొండపాలెంలో నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పడాల అరుణకు పరామర్శ



మాజీ మంత్రి అరుణను పరామర్శిస్తున్న మృణాళిని, నాగార్జున

గజపతినగరం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని తెదేపా పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీ మంత్రి మృణాళిని బుధవారం పరామర్శించారు. తెదేపా నాయకులు జి.గోవిందరావు, ప్రదీప్‌కుమార్, జనసేన మండలాధ్యక్షుడు ఎం.జగన్నాథరావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హెచ్ఎంలతో సమావేశం

రేగిడి: పాఠశాల విద్యాశాఖ మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అంతర్జాల సమావేశం నిర్వహించింది. ఉంగరాడమెట్ట గురుకుల కళాశాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 1 నుంచి 10 తరగతుల వరకు గుర్తింపు కార్డులు తదితర అంశాలపై ఉన్నతాధికారులు సూచనలు చేశారని ఎంఈవో ప్రసాదరావు తెలిపారు.

25న ఉద్యోగ మేళా

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 25న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేళా ఉంటుందని చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పూర్తిచేసిన 35 ఏళ్ల వయసులోపు వారు హాజరుకావచ్చన్నారు.

అయిదుగురి అరెస్టు

రాజాం: బొద్దాం- కొరారిపురం మధ్య వనాల్లో జూద శిబిరంపై బుధవారం దాడి చేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. నిందితుల నుంచి రూ.32,970 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అదుపులో నిందితుడు

రాజాం: రాజాం ప్రాంతీయాసుపత్రిలో బుధవారం విద్యుత్తు పరికరాల చోరీకి యత్నించిన నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలక్ట్రికల్ వస్తువు లున్న పెట్టెను ఎత్తుకెళ్తుండగా.. గుర్తించి స్టేషన్‌లో అప్పగించామని సూపరింటెండెంట్ హరిబాబు తెలిపారు.

వేధింపులు ఆపాలి

గజపతినగరం: రామన్నపేట అంగన్‌వాడీ సహాయకురాలు సౌజన్యను రాజకీయ కక్షతో తొలగించాలని చూస్తున్నారని, ఈ విధానం సరికాదని రాష్ట్ర అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, జిల్లా అధ్యక్షురాలు పైడిరాజు, గౌరవాధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గజపతినగరం: విజయనగరం ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. మధుపాడ పరిసరాల్లో ఈనెల 15న ఓ వ్యక్తి పడి ఉండగా ఆసుపత్రిలో చేర్పించామని, వీఆర్వో విష్ణుమూర్తి వివరాల మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈయన గతంలో మధుపాడ, పెదమానాపురం ప్రాంతాల్లో యాచక వృత్తి నిర్వహించినట్లు స్థానికులు చెప్పారని ఎస్సై తెలిపారు.

అతిసారంపై ఆరా..

గజపతినగరం: కెంగువలో అతిసారం ప్రబలడంతో డీఎంహెచ్‌వో భాస్కరరావు బుధవారం గ్రామంలో పర్యటించారు. వైద్యులు ఆర్.పుష్పాంజలి, అనూజ్‌రాయ్, సుష్మ నుంచి వివరాలు సేకరించారు.

దుప్పట్ల పంపిణీ

బొబ్బిలి గ్రామీణం: కలవరాయి, పిరిడి బీసీ సంక్షేమశాఖ బాలుర వసతి గృహాల విద్యార్థులకు చలికాలం నేపథ్యంలో స్థానిక నాయకులు బొత్స నటరాజ్, సింహాచలం, జి.హరికృష్ణ, పి.కృష్ణమూర్తి తదితరులు బుధవారం దుప్పట్లు అందజేశారు. కలవరాయిలో 102, పిరిడిలో 50 మందికి అందించారు.

పనులు ప్రారంభించాలి

తెర్లాం: పల్లెపండగలో కేటాయించిన పనులను సత్వరమే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్ అన్నారు. కూనాయవలస, రంగప్పవలస, పణుకువలస, డి.గదబవలస, వెలగవలస, గంగన్నపాడు, కుసుమూరు, నందబలగ తదితర గ్రామాల్లో పర్యటించారు.



గరివిడి: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

గరివిడి, గుర్ల, సంతకవిటి, గజపతినగరం, న్యూస్‌టుడే: గరివిడి మండలం కోనూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 24 మంది రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం టీవీజీకే మూర్తి, పీడీ విజయలక్ష్మీ బుధవారం తెలిపారు. ● గరికివలస, చింతలపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.లక్ష్మీ ప్రసన్న, ఎస్.పూజిత, జమ్ము శ్రావణి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీలు మల్లికార్జునరావు, లక్ష్మణ్ చెప్పారు.● విద్యార్థులు డి.జ్యోత్స్న, ఎస్.సుజాత, పి.శ్రీలత, ఎస్.సునీత, ఎస్.కల్పన, జి.మేఘన రాష్ట్రస్థాయి పాఠశాల పోటీలకు ఎంపికైనట్లు సిరిపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరావు చెప్పారు. ●మరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు సురేంద్ర, రవి, దుర్గ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నాగమణి తెలిపారు.

సీఐడీ డీసీపీ పేరుతో ఉపాధ్యాయుడికి ఫోన్

బొబ్బిలి, న్యూస్‌టుడే: రోజురోజుకీ ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. బుధవారం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఎం.విజయమోహనరావుకు ముంబయి సీఐడీ కార్యాలయం నుంచి డీసీపీ చిత్ర మనోహర్ అని చెప్పి ఫోన్ వచ్చింది. 'విదేశాల్లో ఉన్న మీ అబ్బాయికి హవాలా మార్గంలో డబ్బులు పంపిస్తున్నారని మావద్ద సమాచారం ఉంది. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేసి మీ ఖాతాలు స్తంభింపజేస్తామని, లేకుంటే కొంత అపరాధ రుసుం చెల్లించాలని' హిందీలో మాట్లాడారు. ఏదో మోసం జరుగుతుందని తెలుసుకుని స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తామని అనగానే ఫోన్ ఆపేశాడు. విషయాన్ని ఉపాధ్యాయుడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

సచివాలయంలో పాము



పామును కొట్టేందుకు బీరువా పైకి ఎక్కిన స్థానికులు

బొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని బొండపల్లి సచివాలయంలో పాము సంచారంతో ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. బుధవారం కార్యాలయంలోకి పాము రావడంతో అందరూ బయటకు పరుగులు తీశారు. గ్రామస్థులకు చెప్పడంతో వారు పామును చంపేశారు.

మద్యం దుకాణం తరలించాలి



కొవ్వొత్తుల ర్యాలీలో మహిళలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: మేదరబంద కూడలి జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తరలించాలని మహిళలు బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పువ్వల శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. ఆలయాలు, పాఠశాలలు దగ్గరలో ఉన్నా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపించారు.

ఉద్యోగులకు సత్కారం



తెర్లాం: సచివాలయ ఉద్యోగుల సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. విజయరాంపురం సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సర్పంచి బి.మధుసూదనరావు ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఉప సర్పంచి వెంకటరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ బి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

25న అంబలం పూజ



స్వప్నహైందవిని సత్కరిస్తున్న ఏసీ ప్రసాదరావు, వెంకటరావు

విజయనగరం కంటోన్మెంట్: కోట ప్రాంగణంలో ఈనెల 25న సాయంత్రం పైడిమాంబ దీక్షాధారుల ఆధ్వర్యంలో అంబలం పూజ నిర్వహించనున్నట్లు పైడిమాంబ దీక్షా పీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో తెలిపారు. బుధవారం చదురుగుడి ప్రాంగణంలో వివరాలు తెలిపారు. ● పైడితల్లి ఉత్సవాల్లో మెరుగైన పనితీరుకు గుర్తుగా వాగ్దేవి సమారాధన సంస్థ వ్యవస్థాపకురాలు స్వప్నహైందవిని దేవస్థానం ఏసీ ప్రసాదరావు, సిరిమాను పూజారి వెంకటరావు సత్కరించారు.



వ్యాసరచన పోటీల్లో సత్తా



విజయనగరంలోని న్యూసెంట్రల్ పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. 'అంతర్జాలం విని యోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు జరగ్గా.. ఎ.లవ సాత్విక్(తొమ్మిదో తరగతి), ఎ.యోషత్ ప్రియ(ఎనిమిదో తరగతి), ఎస్.సాయి వర్షిత(తొమ్మిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. పాఠశాల ప్రధానాచార్యుడు చింతగుంటి వెంకట మణి కంఠ రవితేజ, ఉపాధ్యాయులు కె.శివకుమార్, కె.సన్యాసినాయుడు విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

? శ్రీనగర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - కె.శ్రీను, స్థానికుడు

● సిబ్బందిని పంపించి, బాగుచేయిస్తాం. - ఎస్.రవికుమార్, ఏఈ సంస్థ

? ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తోటపాలెం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. - స్థానికులు

● పరిశీలించి, చర్యలు చేపడతాం. - పి.నల్లనయ్య, కమిషనర్

? క్రాంతినగర్‌లో మట్టి దారులే ఉన్నాయి. - స్థానికులు

● నిధుల లభ్యత మేరకు రోడ్లు వేస్తాం. - పి.నల్లనయ్య, కమిషనరు

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



సమస్య: భీమసింగి నుంచి ఎస్.కోట వరకు రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

సమాధానం: తొలగించడానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే తొలగిస్తాం. - అర్‌అండ్‌బీ ఏఈ, ఉదయ్ – న్యూస్‌టుడే, జామి

సర్వసభ్య సమావేశం



విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ పింఛనుదార్ల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవలే ఎన్నికైన రామచంద్రరావును జిల్లాశాఖ తరఫున సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్ర పండా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుగంధర్, జిల్లా కార్యదర్శి తిరుపతిరావు, కోశాధికారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

అడుగడుగునా అవస్థలు

విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో గత అయిదేళ్ల వైకాపా పాలనా వైఫల్యాలతో ప్రజలకు సమస్యలతో సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అభివృద్ధి పనులు జరగకపోవడం, కొన్నిచోట్ల ప్రారంభించినా మధ్యలోనే ఆపేయడంతో ఇక్కట్లు పడుతున్నారు. అధ్వాన దారులు, శిథిలావస్థకు చేరిన కాలువలు, అరకొర పారిశుద్ధ్య చర్యలు.. తదితర సమస్యలు వెంటాడుతున్నాయి.



ప్రదీప్‌నగర్‌లో పేరుకుపోయిన మురుగునీరు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే

సమస్యల తిష్ఠ..

పూల్‌బాగ్ ప్రాంతంలో సమస్యలు తిష్ఠ వేశాయి. అయ్యప్పనగర్‌లో రాళ్లు తేలిన రహదారులు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో కొంత కాలంగా తాగునీటి పైపులైన్లు లీకవుతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆదర్శ పాఠశాలలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. సాయినగర్, సిద్ధివినాయకనగర్‌లో సొంతంగా విద్యుత్తు స్తంభాలు వేయించుకున్నామని చెబుతున్నారు. జగదాంబనగర్, శ్రీసాయినగర్, శ్రీసిద్ధివినాయక నగర్‌లో దారులు నరకప్రాయంగా మారాయి. మరోవైపు ఇక్కడి పార్కుల్లోకి అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. సుబ్రమణ్యస్వామి కోవెల దారిలో మురుగు వ్యవస్థ పడకేసింది. లక్ష్మీగణపతికాలనీ-2లోని పార్కు స్థలంలో భవన నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా పేరుకున్నాయి. హనుమాన్‌నగర్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేవు.



లక్ష్మీగణపతికాలనీ-2లో పార్కు స్థలంలో వ్యర్థాల గుట్టలు

అక్కడా అంతే..

కామాక్షినగర్‌లో మట్టి దారులే కనిపిస్తున్నాయి. కాలువల వ్యవస్థ దారుణంగా ఉంది. ఖాళీ స్థలాలు మురుగుకూపాలుగా మారాయి. గంట్యాడ రోడ్డులోని శ్రీచైతన్య కళాశాల దారిలో కొన్నేళ్ల నుంచి ఉన్న బస్ షెల్టర్‌ను వైకాపా హయాంలో కూల్చేశారు. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. అయ్యన్నపేట నుంచి కామాక్షినగర్‌కు వెళ్లే బీటీ దారి ఛిద్రమైంది. ఖాళీఘాట్ కాలనీలోని క్రాంతినగర్‌లో పక్కా దారులు లేవు. నిధుల లభ్యత మేరకు పనులు చేపడతామని, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.



కామాక్షినగర్‌లో మట్టిదారులే

అపరిశుభ్రంగా దారులు..

ప్రదీప్‌నగర్‌లో పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయి. రోడ్లు, కాలువలను శుభ్రం చేయడం లేదని అక్కడివారు చెబుతున్నారు. వైఎస్సార్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అపార్టుమెంట్లు, గ్రూపు ఇళ్లు ఉన్న చోట ప్రధాన కాలువలను అనుసంధానం చేయకుండా వదిలేశారు. దీంతో ఎక్కడికక్కడే నిల్వ నీరు చేరుతోంది. ఈక్రమంలో దోమలు విజృంభిస్తున్నాయి.

పారిశుద్ధ్య కార్యక్రమాలపై దృష్టి సారించండి



నాతవలసలో కాలువ పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

డెంకాడ, కొత్తవలస, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. నాతవలసలో పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాలను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలని, కాలువల్లో పూడికలు తీయించి బ్లీచింగ్ చల్లించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు. ★ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కొత్తవలస మండలం తుమ్మికాపల్లిలో సర్పంచి విరోతి కొండలరావు నిర్వహణ ప్రారంభించారు.

26 ట్యాంకులు శుభ్రం... విజయనగరం పట్టణం, గ్రామీణం: నగరంలో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నట్లు కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. నగరపాలికలో 36 ఉండగా ఇంత వరకు 26 చోట్ల శుభ్రం పనులు జరిగాయన్నారు. ★ మండలంలోని పలు పంచాయతీల్లో ఎంపీడీవో చంద్రకళ, ఈవోపీఆర్డీ తిరుపతినాయుడు ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాలు జరిగాయి. మంచినీటి ట్యాంకులను తనిఖీ చేసి, క్లోరినేషన్ చేయించారు.

ఎల్.కోట: గ్రామాల్లో అంటు రోగాలు ప్రబలకుండా తగిన కార్యాచరణతో ఉండాలని మండల ప్రత్యేకాధికారి (డీఈవో) ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మండల స్థాయి అధికారులు, ప్రత్యేక బృందంతో రంగరాయపురం, ఖాసాపేట, ఎల్.కోట, సంతపేట గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య తీరు పరిశీలించారు. నీటి పరీక్షలు చేయకుంటే చర్యలు తప్పవన్నారు.

అసంపూర్ణం.. అవస్థలమయం



విజయనగరం మండలం బియ్యాలపేట రైతుభరోసా కేంద్రం నిర్మాణం మూడేళ్లుగా అసంపూర్తిగా ఉంది. అన్ని సౌకర్యాలతో రైతు సేవా కేంద్రం నిర్మిస్తామని ప్రగల్భాలు పలికిన గత పాలకులు పనులను పునాదుల దశలోనే నిలిపేశారు. సంవత్సరాల మధ్యలోనే వదిలేయడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీనినై మండల వ్యవసాయాధికారి హర్షలత వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు సేంద్రియ వ్యవసాయం చేస్తే ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు నాగభూషణం చెప్పారు. బుధవారం విజయనగరం మండలంలోని కొండకరకం, చెల్లిపేటలో వ్యవసాయాధికారి హర్షలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ.. మెరుగైన దిగుబడులు సాధించాలని సూచించారు. ఏడీఏ భారతి, వ్యవసాయ శాస్త్రవేత్త త్రివేణి పాల్గొన్నారు.



క్షేత్ర పరిశీలనలో వ్యవసాయాధికారులు, రైతులు

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన వారితో సూపరింటెండెంటు అప్పలనాయుడు తదితరులు

విజయనగరం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం మహారాజా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జ్యోతిర్మయి, భీమేష్, కోశాధికారిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా చంద్రసాయి, కార్యవర్గ సభ్యులుగా మరో అయిదుగురు ఎన్నికయ్యారు. వీరిని ఆసుపత్రి సూపరింటెండెంటు ఎస్.అప్పలనాయుడు అభినందించారు.

ఘనంగా అన్నసమారాధన

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల సెగిడివీధి రామమందిరం వద్ద దేవి నవరాత్రుల సందర్భంగా సుమారు 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి అన్న ప్రసాదాలను భక్తులకు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యకర జీవితం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ధ్యానంతో మానవునికి మరింత ఆరోగ్య వంతమైన జీవితం లభిస్తుందని పిరమిడ్ ధ్యాన గురువు దివంగత పత్రీజీ శిష్యుడు, ధ్యాన విశిష్టత, ఆవశ్యకతల ప్రచారకుడు డా.గోపాలకృష్ణ అన్నారు. నెల్లిమర్ల మండలం కొత్తపేట సమీపంలో ఉన్న బృందావన వ్యాలీలో పత్రీజీ శిష్యుడు పిరామిడ్, ఆయన కుమారుల ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి వ్యక్తికి ధ్యానం, జ్ఞానం ఎంతో అవసరమన్నారు. ధ్యాన గురువులు గౌతమ్, రామారావు, సతీష్, జ్యోతి, శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

ప్రథమ చికిత్సతో మేలు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: గుండె ఆగినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్స (సీపీఆర్)పై రెడ్‌క్రాస్ వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో సీపీఆర్‌పై సదస్సు నిర్వహించారు. డీవీఎల్.నారాయణ, చిన్నంనాయుడు, విజయకుమార్, కె.సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సంక్షిప్త సమాచారం

మర్యాద పూర్వక కలయిక



కంటోన్మెంట్: ఆంధ్రప్రదేశ్ టిడ్కో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వేములపాటి అజయ్‌కుమార్‌కు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లా నాయకుడు అయ్యలు శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టుకార్డుల ఉద్యమం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం హామీను వెంటనే నెరవేర్చాలని డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్ డిమాండు చేశారు. బుధవారం విజయనగరంలో పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు.

మృతుడి వివరాలు లభ్యం

పూసపాటిరేగ, (భోగాపురం): ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమైనట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు. బూరపేటకు చెందిన పులప గౌరీశంకర్(30)గా గుర్తించినట్లు తెలిపారు. ఈయన ఉపాధి నిమిత్తం విశాఖలో నివసిస్తున్నాడు. ఈ నెల 21న విశాఖ నుంచి పూసపాటిరేగకు బైకుపై వస్తుండగా, సుందరపేట వంతెన డివైడర్‌కు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

కొత్తవలస: విశాఖ జిల్లా పద్మనాభం మండలం కోడిగుడ్లపెంట గ్రామానికి చెందిన అప్పలరాజుపై పోక్సో కేసు నమోదు చేశామని కొత్తవలస సీఐ షణ్ముఖరావు బుధవారం తెలిపారు. ఇదే మండలానికి చెందిన యువతి మూడేళ్ల క్రితం సాంబయ్యపాలెంలోని తన నాన్నమ్మ ఇంట్లో ఉండగా ఆ యువకుడు లైంగికంగా వేధించాడని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదుచేసి వైద్య పరీక్షల కోసం యువతిని కేజీహెచ్‌కి పంపామన్నారు.

గ్రామసభలో 34 వినతులు

వేపాడ, న్యూస్‌టుడే: బల్లంకిలో నిర్వహించిన రీసర్వే సమస్యల గ్రామసభలో 34 వినతులు వచ్చినట్లు తహసీల్దారు రాములమ్మ తెలిపారు. వీటిలో జాయింట్ పట్టాలు విడదీయడానికి 13, మ్యుటేషన్‌కు 16, విస్తీర్ణంలో తేడాలు సరిచేయడానికి ఒకటి, పట్టాదారు వివరాల నమోదులో తప్పిదాలపై 4 వచ్చాయన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు తులసి, పంచాయతీ కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

ఒప్పంద సహాయకురాలికి సాయం

ఎల్.కోట: ఎమ్మార్సీలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న నిరుపేద గృహిణి కట్టోజు శ్రీదేవికి ఉపాధ్యాయులు, ఎంఈవోలు కూర్మారావు, శ్రీనివాస్ సంయుక్తంగా రూ.60 వేలు సాయం బుధవారం అందించారు. కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేసిన ఆమె భర్త రాజు అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉపాధ్యాయ బృందం నగదు సేకరించి అందజేశారు.

పూర్వ విద్యార్థిని గుండె శస్త్రచికిత్సకు సాయం



లక్కవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని చందులూరు ఉన్నత పాఠశాల్లో చదువుకున్న మార్లాపల్లికి చెందిన పూర్వ విద్యార్థిని కాటపల్లి అనూష గుండె సంబంధిత శస్త్ర చికిత్సకు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేయూతనిచ్చారు. నిరుపేద కుటుంబానికి చెందిన అనూష ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో తండ్రి దేముడు పరిస్థితిని చూసి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రూ.25 వేలు సేకరించి అందజేశారు.

'పల్లెపండుగ'కు సిమెంటు బస్తా రూ.270

కొత్తవలస: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లెపండగ' కార్యక్రమంలో భాగంగా చేపట్టే పనులకు సిమెంటు బస్తా ధరను రూ.270గా నిర్ణయించింది. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయని పంచాయతీరాజ్ ఎస్.కోట డీఈ స్వామినాయుడు బుధవారం 'న్యూస్‌టుడే'కి చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో సిమెంటు హోల్‌సేల్ ధర నాణ్యతను బట్టి రూ.240 నుంచి రూ.330 వరకు ఉంది. నియోజకవర్గానికి కొత్తవలస యార్డు నుంచి ఇసుక సరఫరా చేస్తారని డీఈ చెప్పారు.

కలెక్టర్‌కు అభినందనలు



మొక్క అందజేస్తున్న శ్రీనివాసరావు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంపై కలెక్టర్ అంబేడ్కర్‌ను వాజీ ఛానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు అభినందించారు. బుధవారం సాయంత్రం ఛాంబర్లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కు నమోదుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ సునీత మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 17 ఏళ్లు నిండిన వారు ప్రోస్పెక్టివ్ ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



నాయకత్వ లక్షణాలు అవసరం



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి రమణ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: బాలబాలికలకు చిన్న వయసు నుంచి దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదపడుతుందని ఉప విద్యాశాఖాధికారి కె.వి.రమణ అన్నారు. బుధవారం పూల్‌బాగ్‌లోని ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ప్రాథమిక శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. శిక్షణ డైరెక్టర్లు డి.ఎల్.నారాయణ, పి.సుశీల, స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు ఈపు విజయకుమార్, సౌభాగ్యలక్ష్మి, బీపీఏ.రాజు, చోడవరపు నారాయణమూర్తి, వేమలి త్రినాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశం కల్పించండి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల నగర పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తూ ఆకస్మికంగా మృతి చెందిన కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని రాష్ట్ర సీఐటీయూ కమిటీ సభ్యుడు ఎ.జగన్‌మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016-18 మధ్య కార్మికులకు రావలసిన ఏరియర్స్ అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. అనంతరం కమిషనరు కె.అప్పలరాజు, ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ కార్యదర్శి బాబూరావు, నాయకులు శేఖర్, పైడిరాజు, శ్రీను, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రేష్మ, భార్గవి

డెంకాడ, న్యూస్‌టుడే: గునుపూరుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కెల్ల రేష్మ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.గౌరీశంకర్ తెలిపారు. ఇటీవల పెదమేడపల్లిలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రేష్మ పాల్గొని 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 800 మీటర్ల పరుగులో తృతీయస్థానం సాధించినట్లు పేర్కొన్నారు. నవంబర్ 2,3,4 తేదీల్లో శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. రేష్మను పాఠశాల ప్రధానోపాధ్యాయిని కృష్ణకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జరజాపుపేట(నెల్లిమర్ల): జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన కె.భార్గవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. డెంకాడ మండలం రఘుమండలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.సూర్యనారాయణ తెలిపారు. వచ్చేనెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. ఉపాధ్యాయులు అభినందించారు. ● మహాత్మ జ్యోతిరావు పులే బాలికల గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని డి.పూజ, మొదటి ఏడాది ఎంపీసీకి చెందిన బి.బిందు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు కామేశ్వరి బుధవారం తెలిపారు

వచ్చే ఏడాదికి ఆదర్శ పాఠశాల ఏర్పాటుకు కృషి

జామి, న్యూస్‌టుడే: జామిలో ఆదర్శ పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలం సేకరణకు చర్యలు తీసుకోవాలని డీఈవోకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎంఈవో జయశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇటీవల సీఎం చంద్రబాబునాయుడుకు జామిలో పాఠశాల మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంఈవో మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో అడుగులు పడ్డాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థల సేకరణ పూర్తికాగానే ప్రతిపాదనలు తయారు చేసి విద్యామంత్రి నారా లోకేశ్‌కు సమర్పిస్తాం. వచ్చే విద్యా సంవత్సరానికి మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు.

క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రారంభం

ఎస్.కోట: ఆర్కే హాలులో భాజపా క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విశాఖ పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా సభ్యత్వం కలిగిన పార్టీగా 10 కోట్ల సభ్యత్వాలకు చేరుకుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పరిశీలకుడిగా శ్రీరాములు



ఎస్.కోట, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన పొట్నూరు శ్రీరాములు ఈ నెల 28, 29, 30 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా మలికిపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాడ్మింటన్ అండర్-14, 17 పోటీలకు పరిశీలకుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నుంచి సమాచారం అందింది. ఆయన మండలంలోని ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాల పీడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆయనను అభినందించింది.

అపార్‌పై అవగాహన

వేపాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అపార్‌పై అవగాహన బుధవారం నిర్వహించారు. టెలీకాన్ఫరెన్సులో జిల్లా అధికారులు ఇచ్చిన సూచనలకు ఎంఈవోలు జగదీశ్వరరావు, బాల భాస్కరరావులతో పాటు ప్రధానోపాధ్యాయులు నమోదు చేసుకున్నారు.